RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం


తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 15 సంచిక : 193 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | గురువారం, 15 జనవరి 2026 | పేజీలు : 4 | వెల : 2/-

# కత్తిమీద సామే!

## జిల్లాల మార్పుచేర్పులతో రాజకీయ చదరంగం!!




హైదరాబాద్ : తెలంగాణలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ అంశం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ తేనెతుట్టెను కదిలించడం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనాపరమైన వ్యూహాలు ఉన్నాయని అనుకోవచ్చు. అయితే ఇది కత్తిమీద సాము లాంటిదే.

**గతంలో అశాస్త్రీయంగా జిల్లాల విభజన...** తెలంగాణలో గత ప్రభుత్వం 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చిన ప్రక్రియలో అనేక అశాస్త్రీయ కోణాలు ఉన్నాయని భావిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వాటిని సరిదిద్దేందుకు నడుం బిగించారు. అయితే, ఈ ప్రకటన వెలువడిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా సెంటిమెంట్ రాజకీయాలు రాజుకున్నాయి. తమ జిల్లా ఉనికి కోల్పోతుందని లేదా పేరు మారుతుందని భావిస్తున్న పలు ప్రాంతాల్లో ఇప్పటికే నిరసనలు మొదలయ్యాయి.

ఈ సున్నితమైన అంశాన్ని ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి ప్రధానంగా న్యాయపరమైన రక్షణ, ప్రజాభిప్రాయం అనే రెండంచుల వ్యూహాన్ని అమలు చేయబోతున్నారు. రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో కమిటీ వేయడం ద్వారా, ఈ ప్రక్రియ రాజకీయ ప్రేరేపితం కాదని, పూర్తిగా నిపుణుల సలహా మేరకే జరుగుతోందని ప్రజల్లోకి తీసుకెళ్లడం ఆయన ఎత్తుగడ.

**పరిపాలనా సౌలభ్యం కోసమే మార్పులు...** అసలు రేవంత్ రెడ్డి ఈ వివాదాస్పద అంశాన్ని ఎందుకు కదిలిస్తున్నారు అనే ప్రశ్నకు పరిపాల నా సౌలభ్యం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కేవలం 5 నుంచి 10 మండలాలతో ఏర్పాటైన చిన్న జిల్లాల్లో కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలు ఇతర మౌలిక వసతుల నిర్వహణ ప్రభుత్వ ఖజానాపై భారంగా మారింది. అలాగే, రెవెన్యూ డివిజన్లు ఒక జిల్లాలో, పోలీస్ పరిధి మరో జిల్లాలో ఉండటం వంటి సాంకేతిక లోపాలు ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. వీటిని సరిదిద్దడం ద్వారా కనిష్ట ప్రభుత్వం - గరిష్ట పాలన సూత్రాన్ని అమలు చేయాలని ఆయన భావిస్తున్నారు. ఇది దీర్ఘకాలంలో ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించి, అభివృద్ధి పనులకు నిధులు మళ్లించేందుకు దోహదపడుతుందని రేవంత్ సర్కార్ నమ్ముతోంది.

**అఖిలపక్ష సమావేశం కూడా ఏర్పాటు...** వ్యతిరేకతను ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి వద్ద ఉన్న మరో ప్రధాన ఆయుధం అఖిలపక్ష సమావేశం . కమిటీ నివేదిక వచ్చిన తర్వాత నేరుగా నిర్ణయం తీసుకోకుండా, అసెంబ్లీలో అన్ని రాజకీయ పార్టీలతో చర్చించబోతున్నారు. దీనివల్ల, రేపు ఏదైనా జిల్లా రద్దయినా లేదా విలీనమైనా ఆ నెపాన్ని కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంపైకి రాకుండా, అందరి అంగీకారంతో జరిగిందని చెప్పే అవకాశం ఉంటుంది. అలాగే, ప్రజల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించడం ద్వారా స్థానిక సెంటిమెంట్లను గౌరవిస్తున్నామనే సంకేతాలను బలంగా పంపాలని ఆయన యోచిస్తున్నారు.

**కత్తిమీద సాములా ప్రక్రియ...** రాజకీయ కోణంలో చూస్తే.. జిల్లాల విభజన ద్వారా క్షేత్రస్థాయిలో కొత్త సమీకరణాలకు రేవంత్ రెడ్డి బీజం వేస్తున్నారు. గత ప్రభుత్వం తమకు అనుకూలమైన నేతల కోసం జిల్లాల సరిహద్దులు గీసిందనే ఆరోపణలు ఉన్నాయి.

ఇప్పుడు వాటిని మార్చడం ద్వారా ప్రతిపక్ష పార్టీల పట్టు ఉన్న ప్రాంతాల్లో రాజకీయంగా పైచేయి సాధించే అవకాశం కూడా ఉంది. అయితే, ఈ ప్రక్రియలో ఏదైనా చిన్న పొరపాటు జరిగినా అది ప్రాంతీయ ఉద్యమాలకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజల సెంటిమెంట్లు సరిగ్గా మేనేజ్ చేయలేకపోతే అది రాజకీయంగా ప్రభుత్వానికి సవాలుగా మారుతుంది.




## పొంగల్ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోదీ




ఢిల్లీ, జనవరి 18: పొంగల్ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమిళ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో పొంగల్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా తొలుత ప్రత్యేక పూజా కార్యక్రమాలను ప్రధాని నిర్వహించారు. అనంతరం ఆయనే స్వయంగా పొంగల్ వండారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ గోవులకు పూజ చేశారు. పొంగల్ వేడుకల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొన్నారు. మరోవైపు ఈ పొంగల్ వేడుకను పలువురు ప్రముఖులు ఘనంగా జరుపుకుంటున్నారు. అలానే దేశ వ్యాప్తంగా ప్రజలు వివిధ రకాల వంటకాలు చేసుకుని, ఇళ్లను అలకరించుకుని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరలు భారీగా పెరిగే అవకాశం; భారత్‌ను కట్టడి చేసేందుకు






అమెరికా అంతర్జాతీయ స్థాయిలో తీసుకుంటున్న నిర్ణయాలు భారత్‌ను పలు విధాలుగా ప్రభావితం చేస్తున్నాయి. వెనిజులాలో అమెరికా జోక్యం భారత్‌కు మేలు చేస్తుందని భావించినప్పటికీ, తాజా పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రపంచంలోనే అత్యధిక ముడి చమురు నిల్వలు ఉన్న వెనిజులా నుండి 50 మిలియన్ బారెళ్ల చమురును మార్కెట్ ధరకే కొనుగోలు చేస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీనివల్ల చమురు ధర బ్యారెల్‌కు 60 డాలర్ల కంటే కిందకు పడిపోయింది. కానీ, ట్రంప్ తీసుకున్న మరొక నిర్ణయం భారత్ వంటి దేశాలకు శాపంగా మారబోతోంది.

**500% దిగుమతి సుంకం...** రష్యా నుండి ముడి చమురు లేదా యురేనియం కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం వరకు దిగుమతి సుంకం విధించే బిల్లుకు ట్రంప్ మద్దతు తెలిపారు. వచ్చే వారం అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్)లో ఈ బిల్లుపై ఓటింగ్ జరగనుంది. ఒకవేళ ఇది పాస్ అయితే భారత్‌కు కష్టాలు తప్పవు.

భారత్‌పై ప్రభావం ఎలా ఉంటుంది? భారత్ ప్రస్తుతం అత్యధికంగా చమురును రష్యా నుండే దిగుమతి చేసుకుంటోంది. రష్యా తక్కువ ధరకు చమురు ఇస్తుండటంతో భారత్‌కు అది లాభదాయకంగా ఉంది. కానీ అమెరికా ఒత్తిడి పెరిగితే: దిగుమతి ఖర్చులు: రష్యా నుండి చమురు కొనడం ఆపేస్తే, ఇతర దేశాల నుండి ఎక్కువ ధరకు కొనాల్సి వస్తుంది.

ఎగుమతులపై దెబ్బ: ఇప్పటికే భారతీయ ఉత్పత్తులపై అమెరికా 25% సుంకం విధించింది. రష్యా నుండి చమురు కొంటున్నారనే కారణంతో మరో 25% పెంచి, మొత్తంగా 50% సుంకం వసూలు చేస్తోంది. దీనివల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు పెరిగి, ఎగుమతులు తగ్గిపోతాయి.

పెట్రోల్ ఑ డీజిల్ ధరలు: దిగుమతి ఖర్చులు పెరగడం వల్ల దేశంలో పెట్రోల్, డీజిల్ మరియు విమాన ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇది నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల (ద్రవ్యోల్బణం)కు దారితీస్తుంది.

**భారత్ ముందున్న సవాళ్లు:** అమెరికా నుండి చమురు దిగుమతులను భారత్ ఇప్పటికే 30% పెంచింది. అయితే, సౌదీ అరేబియా వంటి దేశాలు భారత్‌కు అదనపు చమురు అందించి సహాయం చేస్తాయా అనేది సందేహంగా ఉంది.

భారత్ మరియు అమెరికా మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు ఇంకా ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు.



# మన ఆర్మీలో భైరవ్‌లు...

## లక్ష మందితో ఆధునిక శక్తి!

## నేడు ఆర్మీ డే పరేడ్ లో ప్రత్యేక దళం కవాతు!!

భారత ఆర్మీ మరింత శక్తిమంతంగా మారుతోంది. ఆధునిక యుద్ధ దళాన్ని సిద్ధం చేసుకుంది. ఈ నెల 15న ఆర్మీ డే పరేడ్ లో ప్రత్యేక దళం కవాతు చేయనుంది. మారుతున్న యుద్ధరీతులు, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా సరికొత్త అస్త్రాలతో ఆధునిక యుద్ధ దళాన్ని మన ఆర్మీ సమకూర్చుకోవడం గొప్ప విషయంగా చెబుతున్నారు. సైన్యంలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా లక్ష మందితో డ్రోన్ ఆపరేటర్ల సైన్యాన్ని ఆర్మీ తయారు చేసిందని కథనాలు వస్తున్నాయి. ఈ దళానికి భైరవ్ అనే పేరు పెట్టారు. శత్రు స్థావరాలను గుర్తించి దాడుల ద్వారా ధ్వంసం చేయడం డ్రోన్ ఆర్మీ కర్తవ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. 'భైరవ్ణ పేరుతో స్పెషల్ ఫోర్సు సిద్ధమైనట్లు ఆర్మీ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ పత్రికలు కథనాలు రాస్తున్నాయి. రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో కొత్తగా ఈ భైరవ్ బెటాలియన్లు పనిచేయనున్నాయని చెబుతున్నారు. ఆధునిక యుద్ధ రంగంలో డ్రోన్ల వినియోగం పెరిగిన నేపథ్యంలో భైరవ్ ఏర్పాటు వెనుక భారీ వ్యూహం ఉందని చెబుతున్నారు. సాధారణ దళానికి, పారా స్పెషల్ ఫోర్సెస్ కి మధ్య వారధిలా 'భైరవ్ణ పనిచేయనుందని సమాచారం. బహుళ స్థాయిల్లో అత్యంత వేగంగా, దూకుడుగా దాడి చేయడం 'భైరవ దళం' ప్రత్యేకతగా చెబుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న భైరవ్ బెటాలియన్ లో ప్రతి ఒక్క సైనికుడికి డ్రోన్ ఆపరేటింగ్, యుద్ధంలో వాటి వినియోగంపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. భారత సైన్యం ఇప్పటికే 15 బెటాలియన్లను ఏర్పాటు చేసుకుంది. ఈ బెటాలియన్లను చైనా, పాక్ సరిహద్దుల్లో వివిద దళాలకు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో వీటిని 25 బెటాలియన్లకు పెంచాలనే లక్ష్యంతో ఆర్మీ ఉన్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో ఈ దళం 5 నెలలుగా కఠోర శిక్షణ తీసుకుంటోందని ప్రచారం జరుగుతోంది. ప్రధానంగా రాజస్థాన్ ఎడారి ప్రాంతం, అక్కడ వాతావరణ పరిస్థితులు, భాష, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్నవారికే ఈ బెటాలియన్ లో ఎక్కువగా నియమించినట్లు చెబుతున్నారు. ఈ నెల 15న జైపూర్ లో జరిగే ఆర్మీ డే పరేడ్ లో భైరవ దళం తొలిసారి కవాతు కూడా చేయనుందని సమాచారం. ఇలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేసుకున్న ఆర్మీ, రుద్ర బిగ్రేడ్ పేరుతో మరో శక్తిమంతమైన వ్యవస్థను కూడా భారత ఆర్మీ సమకూర్చుకుంటోందని అంటున్నారు. ఇందులో పదాతిదళం, యాంత్రిక యూనిట్లు, ట్యాంకులు, ఫిరంగి దళం, ప్రత్యేక దళాలు, డ్రోన్ వ్యవస్థలన్నీ ఉంటాయని అంటున్నారు. భైరవ్ బెటాలియన్ తో పాక్ సరిహద్దుల్లో నిఘా మరింత పటిష్టమయ్యే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. ప్రస్తుతం పాక్ సరిహద్దు వెంబటి రాష్ట్రాల్లో డ్రోన్ల ద్వారా మాదక ద్రవ్యాలు, మరణాయుధాలను ఉగ్రవాదులు దేశంలోకి చొప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటిని ఎప్పటికప్పుడు మన సైన్యం గుర్తిస్తూ కూల్చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి కశ్మీర్ వరకు సుదీర్ఘంగా ఉండే సరిహద్దు వెంబడి ఒక్కోసారి పదుల సంఖ్యలో డ్రోన్లు వస్తున్నట్లు గతంలో అనేక వార్తలు వచ్చాయి. దీంతో సరిహద్దుల్లో ఉన్న సైనికులకు అదనపు పని ఒత్తిడి పెరిగిపోయింది. వారిపై ఒత్తిడి తగ్గించేలా 'భైరవ'ను ఏర్పాటు చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని, నిఘా కట్టుదిట్టం అవుతుందని వ్యాఖ్యానిస్తున్నారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## పహల్గామ్ తరహా మరో దాడికి పాక్ కుట్ర?

జాతీయ భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఇండియన్ ఆర్మీ తక్షణ చర్యలకు సిద్ధంగా ఉందని పశ్చిమ కమాండ్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ స్పష్టం చేశారు. పహల్గామ్‌లోని ఘోర ఉగ్రదాడికి సమానం అయిన మరో దాడికి పాకిస్థాన్ వల్ల అవకాశముందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి దూశ్చర్యానికి ఎదురుగా స్థిరమైన, మరింత శక్తివంతమైన ప్రతీకారం అందిస్తామని, అవసరమైతే 'ఆపరేషన్ సిందూర్ 2.0'ను అమలు చేసే విషయంలో భారత్ సిద్ధంగా ఉందని తెలిపారు. లెఫ్టినెంట్ జనరల్ కటియార్ మాట్లాడుతూ.. పాకిస్థాన్ సంబంధిత కదలికలన్నింటిపై భారత సైన్యం నిఘా వేస్తున్నదని.. వీలైనంత వరకు శత్రువు ఉగ్రకార్యకలాపాలను నిరోధిస్తామని చెప్పారు. అయితే పాకిస్థాన్ స్వార్థ ప్రయోజనాల కోసం ఘర్షణలను కొనసాగించాలని కోరుకుంటున్నప్పుడే.. మరో సారికి దూశ్చర్య చేస్తే భారత సైన్యం మరింత గట్టి సమాధానం ఇవ్వాల్సి వచ్చే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు.

**ఆపరేషన్ 'సిందూర్' ٨ ఇంకా ముగియలేదు...** లెఫ్టినెంట్ జనరల్ కటియార్ గుర్తు చేస్తూ.. పహల్గామ్ దాడి తర్వాత ప్రారంభించిన భారీ కౌంటర్-టెర్రర్ చర్యైన 'ఆపరేషన్ సిందూర్' పూర్తికాలేదని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ ప్రధానంగా నియంత్రణ రేఖ వెంబడి చొరబడే ఉగ్రవాది బృందాలపై దాడులు చేయడం, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం మొదలైన వాటిని లక్ష్యంగా పెట్టుకుంది. పాకిస్తాన్‌కి తగిన సమాధానం వచ్చింది అయినప్పటికీ, శత్రువు మార్గం మార్చకపోవడం వల్ల అవసరమైతే చర్యలు కొనసాగతామని తెలిపారు.

**వరుసగా భారత ఆర్మీ అధికారుల హెచ్చరికలు...** ఈ నెల ప్రారంభంలోనే భారత వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏ.పి. సింగ్ ఒక కీలక ప్రకటన ద్వారా ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత చర్యలలో కనీసం 11 పాకిస్థానీ సైనిక విమానాలు ధ్వంసమయ్యాయని, అలాగే పాకిస్థాన్ సైనిక మౌలిక సదుపాయాలకు భారీ నాశనం కలిగిందని వెల్లడించారు. తాము ఎదుర్కొంటున్న నష్టాలపై ఇస్లామాబాదు చేస్తున్న వాదనలు 'కల్పిత కథలు' మాత్రమేనని ఆయన చెప్పినట్లు చర్యల యొక్క పరిమాణాన్ని భారత అధికారులు ప్రకటించారు. ప్రకటనలో హ్యాంగర్లు, రాడార్ వ్యవస్థలు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్స్, రన్‌వేలు వంటి ప్రత్యేక సదుపాయాలను భారత్ ధ్వంసం చేసిందన్నారు.

**సరిహద్దు విజ్రంభణల్లో ప్రభుత్వ- సైనిక సిద్ధత...** లెఫ్టినెంట్ జనరల్ కటియార్ స్పష్టీకరించినట్టుగా, భారత సైన్యం పూర్తిచేయదగ్గంత స్థాయిలో సన్నద్ధతతో ఉంది. పాకిస్థాన్‌పై గట్టి ప్రతిస్పందన అవసరమైతే దానిని అవసరం మేరకు అమలు చెయ్యాలని ఆయన అంటున్నారు. పశ్చిమ సరిహద్దులపై ఉన్న శాంతి, హింస నివారణం కోసం కొనసాగుతున్న నిఘాకృషి, సంబంధిత నిఘా కార్యాచరణలని భారత కమాండ్ అధికారులు మరింత బలోపేతం చేయనున్నారు.

**ఏది మారినా అపసంభావ్యత...** పహల్గామ్ దాడి వంటి ఘోర సంఘటనలు దేశీయ భావోద్వేగాలకు తోడ్పడతాయి. అదే సమయంలో రక్షణ వ్యవస్థల చురుకుదనం, ప్రతిస్పందన సామర్థ్యం మీద కూడా ప్రశ్నలుంటాయి. అయితే అధికారి వ్యాఖ్యలు, ఆపరేషన్ సిందూర్ వంటి కార్యాచరణలు శాంతి స్థితిని బలోపేతం చేయడానికి కాకుండా ప్రతికూల ఫలితాలకూ దారితీసే ప్రమాదం ఉన్నప్పటికీ.. సరిహద్దుల దగ్గర జరిగిన లేదా జరగబోయే పరిస్థితులపై ప్రభుత్వ నిశ్చిత నిర్ణయమే తాత్కాలికంగా కీలకంగా ఉంటాయి. లెఫ్టినెంట్ జనరల్ మనోజ్ కుమార్ కటియార్ ఇచ్చిన తాజా హెచ్చరికలు దేశీయ ప్రజలకు సైన్యం ప్రతిస్పందించడానికి సిద్ధంగా ఉందని, ప్రభుత్వాలు కూడా సజాగ్రతతో నిర్ణయాలు తీసుకుంటున్నాయని ఒక సంకేతాన్ని పంపుతున్నాయి. అదే సమయంలో ప్రాంతీయ విజృంభణలకు అంతర్జాతీయ సానుకూల చర్యల అవసరమని ఈ సందర్భంలో మరింత స్పష్టంగా కనిపిస్తుంది. భద్రతా అంశాలపై అధికారుల వ్యాఖ్య లు ప్రజలలో ఆందోళన కలగజేసినప్పటికీ, ప్రధాని కేంద్రం, రాష్ట్ర అధికారులతో కలిసి సరిహద్దు పరిస్థి తులు, సైన్య స్పందనలు, డిప్లొమాటిక్ చానల్స్ ద్వారా ఒత్తిడి తగ్గింపులపై చెప్పుకున్న చర్యలపై కూడా దారి చూపాల్సి ఉంటుంది. ప్రజల శాంతి, భద్రత ప్రాధాన్యం మరింత సమన్వయం, పారదర్శకతతోనే సాధ్యమవుతుంది.

# ఇసుక క్వారీలపై మూడో కన్ను



తెలంగాణ చౌక్: ఒకప్పుడు ఉచితంగా లభించే ఇసుక ప్రస్తుతం ఆర్థిక వనరుగా మారింది. ప్రభుత్వానికి కాసులు కురిపిస్తోంది. క్వారీల్లో కూడా లోడింగ్‌కు, పట్టాకు డబ్బులు వసూలు చేయడంలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. ఇటీవల జిల్లాలో టీజీఎండీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు ఇసుక రీచ్‌ను, పచ్చునూర్, మామిడాలపల్లి చెక్‌పోస్టులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌష్ ఆలం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రభుత్వానికి నివేదిక**

ఇసుక క్వారీల్లో లోడింగ్, పట్టా వేయడానికి డబ్బులు వసూలు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్, సీపీ రీచ్‌లను పరిశీలించి క్వారీల్లో అడుగడుగునా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. లారీలు లోపలకు వచ్చి.. బయటకు వెళ్లే దాకా.. ప్రతీది రికార్డు చేయాలని, సాండ్ ఆడిట్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు.

క్వారీలను భూగర్భగనుల శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) అధిక లోడ్, అక్రమ రవాణా, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించారు. వీరి పరిశీలనలో తేలిన అంశాలను ప్రభుత్వానికి నివేదించనున్నారు.

వీరి నివేదికల ఆధారంగా ప్రభుత్వం అక్రమాలకు తావులేకుండా పటిష్ట చర్యలు తీసుకునే అవకాశముంది. కొందరు సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా కొన్నింటిలో నెట్‌వర్క్ సమస్య వస్తున్నట్లు తెలిసింది.

**నిత్యం 10 వేల మెట్రిక్ టన్నులు..**

జిల్లాలో కొండపాక-1,2, చల్లూర్-1, పోతిరెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి-1, 2, కొరెకల్, ఉటూర్1, 2, 3 బ్లాక్‌లు ఉన్నాయి. ఇందులో కొండపాక-1ను సాండ్‌బజార్‌కు కేటాయించారు. కొండపాక-2, చల్లూరు, పోతిరెడ్డిపల్లి, ఉటూర్-2లో తవ్వకాలు జరుగుతున్నాయి. వీటి ద్వారా నిత్యం 10 నుంచి 13 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తరలిస్తున్నారు. ప్రభుత్వానికి రూ.లక్షల ఆదాయం సమకూరుతోంది.

**నిఘా నేత్రాలు ఏర్పాటు చేశాం** ప్రస్తుతం అన్ని క్వారీల్లో ఇసుక తవ్వకాలు, లోడింగ్, వేబ్రిడ్జి, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు బిగించాం. నిఘా నేత్రాల ద్వారా నిరంతరం హైదరాబాద్ స్థాయి ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తుంటారు. క్వారీల్లో 45 మంది వరకు పొరుగు సేవల సిబ్బంది పనిచేస్తున్నారు. అక్రమాలకు తావులేకుండా నిబంధనల మేరకు నడుచుకుంటున్నాం.
వినయ్‌కుమార్, పీవో, టీజీ-ఎండీసీ

# ఆగని అఘాయిత్యాలు



గోదావరిఖని : పోక్సో కేసుల కోసం ఏర్పాటు చేస్తున్న కోర్టులు తగ్గించే పరిస్థితి రావాలి. బాలికలపై నిత్యం అత్యాచారాలు జరగడం బాధిస్తోంది. ఇవి పెరగకూడదు. వందల సంఖ్యలో ఉన్న కేసులు వేలకు చేరుకుంటున్నాయి. వీటితో పాటు కోర్టులు పెంచుకోవాల్సి వస్తోంది. నిర్మల్ జిల్లాలో కోర్టు భవనాల ప్రారంభం సందర్భంగా ఇటీవల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్
కానీ పోక్సో కేసులు పెరుగుతున్నాయి. దానికి అనుగుణంగా ప్రత్యేకంగా కోర్టులు ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. గతంలో ఉమ్మడి జిల్లాకు పోక్సో కేసుల కోసం ఒకే ఒక కోర్టు ఉండగా ప్రస్తుతం నాలుగు కోర్టులు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. వంద పోక్సో కేసులున్న ప్రతిచోట ఒక కోర్టు ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు సూచన. దానికి అనుగుణంగా ఉమ్మడి జిల్లాలో నమోదవుతున్న పోక్సో కేసులతో కోర్టుల్లో విచారణలు సాగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నాలుగు పోక్సో కోర్టుల్లో వందల సంఖ్యలో కేసులు విచారణలో ఉన్నాయి.

**పెండింగ్‌లోనే ఎక్కువ**

పోక్సో కేసుల్లో శిక్షల శాతం తక్కువగానే ఉంటుంది. కోర్టుల్లో ఎక్కువ మొత్తంలో పెండింగ్‌లో ఉంటున్నాయి. కేసుల సంఖ్యతో పోల్చుకుంటే శిక్షల ఖరారులో తక్కువ శాతం నమోదవుతున్నాయి. 2024లో 46 కేసుల్లో నిందితులకు శిక్షలు పడగా 2025లో కేవలం ఆరుగురికి మాత్రమే శిక్ష పడింది. పోక్సో చట్టాన్ని 13 ఏళ్ల క్రితం ప్రవేశ పెట్టగా ఈ చట్టం ద్వారా నిందితులకు జీవితఖైదు విధించే అవకాశం ఉంది. కేసు తీవ్రత ఆధారంగా శిక్షలు ఖరారు చేస్తారు. 18 సంవత్సరాల లోపు బాలికలపై జరిగే లైంగిక దాడులపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ చేపడుతారు.


**నాలుగు జిల్లాల్లోనూ..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2024లో 53 కేసులు నమోదైతే 2025లో 61కి పెరిగాయి. ఇదే విధంగా కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో కేసుల సంఖ్య పెరుగుతూనే ఉంది.

**చిన్నారులు జరభద్రం**

పిల్లలను ఇంటి వద్ద వదిలి పనులకు వెళ్లే తల్లిదండ్రులు ఇంటి పక్కన ఉన్న వారికి పిల్లలను చూడమంటారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని కొంతమంది చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తప్పక అవగాహన కలిగించాలి. ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే గట్టిగా అరవాలని సూచించాలి. నీ ఇళ్లలో తెలిసినవారు, బంధువుల ద్వారా.. విద్యాలయాల్లో సిబ్బంది చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. వీలైనంత వరకు చిన్నారులను ఒంటరిగా ఇళ్ల వద్ద ఉంచొద్దు. స్వీయ రక్షణ చర్యలు నేర్పించాలి. అపరిచితులతో వ్యవహరించాలో తెలియజేయాలి.

# సు'జలం'.. స'ఫలం'



ఖమ్మం : చెంతనే రెండు పంటలకు నీరందించే నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాల్వ.. మెట్టప్రాంతంలో సాగునీటికి తప్పని గోస. వానొస్తే.. చెరువులు నిండితేనే వానాకాలంలో పంటల సేద్యం.. లేకుంటే బీడు భూములే.. ఇక రెండోపంట దేవుడెరుగు. ఇదీ ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం, అర్బన్ మండలాల పరిస్థితి. ఈ సాగునీటి కష్టాలు మంచుకొండ ఎత్తిపోతల పథకంతో తొలగిపోనున్నాయి. రూ.66.33కోట్లతో 2,412 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు ఏర్పాటుచేసిన ఎత్తిపోతల.. శంకుస్థాపన జరిగిన ఏడాదిలోపు అందుబాటులోకి రాబోతోంది. మంగళవారం ప్రారంభం కాబోతోంది.

**ఏడాదిలోనే శంకుస్థాపన.. ప్రారంభం**

ఖమ్మం నియోజకవర్గంలో 17 గ్రామాల్లోని 27 చెరువులను కృష్ణాజలాలతో నింపాలనే లక్ష్యంతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టిన ఎత్తిపోతల పథకానికి గతేడాది జనవరి 13న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించాలన్నది ఈ పథకం లక్ష్యం. వి.వెంకటాయపాలెం వద్ద ఎన్నెస్పీ కాల్వలో పారుతున్న సాగర్ జలాల్లో 39 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసి 9కి.మీ. దూరంలోని మంచుకొండ(వేర్‌హౌస్)కు, అక్కడి నుంచి ఐదు గేట్‌వాల్వ్‌లున్న గ్రావిటీ పైపులైన్ ద్వారా 25కి.మీ. తరలించి చెరువులు నింపేలా దీనిని రూపొందించారు. గతేడాది ఏప్రిల్‌లోనే ట్రయల్ రన్ నిర్వహించి ఏడు చెరువులకు నీరందించారు. మిగిలిన పనులన్నీ పూర్తిచేసుకొని ప్రారంభోత్సవానికి ఎత్తిపోతల సిద్ధమైంది. ప్రస్తుతం 16 చెరువులు కృష్ణాజలాలతో కళకళలాడుతున్నాయి. మిగిలిన నీటివనరులనూ నింపటానికి చర్యలు తీసుకుంటున్నారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం రాకముందు యాసంగి పంటలు పండేవి కాదని, ఇది అందుబాటులోకి వచ్చాక చెరువుల్లో జలకళ కనిపిస్తోందని రైతులు చెబుతున్నారు. భూగర్భజలాలు పెరిగాయని, వేసవిలో పశువుల తాగునీటికి ఢోకా లేదని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**మరిన్ని చెరువులకు కృష్ణాజలాలు**

రఘునాథపాలెం మండలంతోపాటు ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి, ఖానాపురం, కొణిజర్ల మండలం తనికెళ్లలోని 27 చెరువులు నింపాలన్నది మంచుకొండ ఎత్తిపోతల పథకం లక్ష్యం. ఇది ఫలించటంతో ఇతర గ్రామాల ప్రజలూ తమ సాగునీటి ఇక్కట్లు తీర్చాలని మంత్రి తుమ్మలకు విన్నవించారు. ఈప్రాజెక్టును సవరించి 36 చెరువులు(అదనంగా తొమ్మిది) నింపేలా రూ.101కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఇందులో రూ.2కోట్లతో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మించారు. 'ఏప్రిల్‌లోపు మరో 18కి.మీ. గ్రావిటీ పైపులైన్ వేసి మిగిలిన తొమ్మిది చెరువులను నింపుతాం' అని నీటిపారుదలశాఖ డీఈ ఝాన్సీ తెలిపారు. రఘునాథపాలెం మండలం మెట్టప్రాంతమవటంతో ఎన్నెస్పీ, సీతారామ ప్రాజెక్టు నీళ్లు రావని మంచుకొండ ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టాం. ఏడాదిలోపే పనులు పూర్తిచేశాం. ఈపథకం ద్వారా మరిన్ని చెరువులు నింపాలని రైతులు కోరటంతో ప్రణాళికలు రూపొందించాం. త్వరలో అన్నింటికీ నీరందిస్తాం. తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ మంత్రి

# దారి వెంట.. ధరల మంట

సూర్యాపేట : నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో దాహం వేస్తుందని నీళ్లసీసా తీసుకుంటే రూ.20కు బదులు రూ.25, పిల్లలు అడిగారని బిస్కెట్స్, చాక్లెట్లు కొంటే రూ.10 విలువైనవి రూ.15, చాయ్ తాగి రూ.10కు రూ.15 అని చెప్పడంతో ప్రతి ఒక్కరు విస్మయానికి గురవుతున్నారు. ధరలు నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు.

..ఈ పరిస్థితి అతనొక్కడిదే కాదు. విజయవాడ-హైదరాబాద్, సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిలో రాకపోకలు సాగిస్తూ అలాంటి డబ్బా కొట్టులో వస్తువులు కొనుగోలు చేస్తున్న వారందరిదీ.

**ఏది కొన్నా రూ.5 అదనం**

సాధారణంగా దుకాణాల్లో, డబ్బా కొట్టులో బిస్కెట్ ప్యాకెట్లు, చాక్లెట్లు ఇతర తినే వస్తువులు ఏదైనా గరిష్ఠ చిల్లర ధర(ఎమ్మార్పీ)కే విక్రయిస్తారు. కానీ, జాతీయ రహదారి వెంబడి హోటళ్ల పక్కనున్న డబ్బా కొట్టు వారు అందుకు భిన్నంగా అమ్మకాలు సాగిస్తున్నారు. తమ వద్ద ఏది కొన్నా ఎమ్మార్పీపై రూ.5 అదనంగా తీసుకుంటున్నారు. మరో విషయం ఏమిటంటే రూ.10, ఆపై ఎక్కువ విలువ చేసే సామగ్రి తప్ప అంతకంటే తక్కువ ధరవి అమ్మరు. అధిక ధరలపై ఎవరైనా ప్రశ్నిస్తే




ఇది జాతీయ రహదారి, ధరలు ఇలానే ఉంటాయని దబాయిస్తున్నారు. కొసమెరుపు: రహదారి పక్కన పేరున్న హోటళ్ల పక్కన డబ్బా కొట్టు నిర్వహిస్తే నిర్వాహకులు కొందరు కిరాయి నెలకు రూ.10 వేలు, మరికొందరు అమ్మిన వాటిలోంచి దాదాపు 15శాతం వాటా తీసుకుంటున్నారు. అందుకోసం అదనంగా తీసుకోవాల్సి వస్తుందని విక్రయదారులు చెప్పుకొస్తున్నారు. కాని సంబంధితశాఖ అధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోదాడకు చెందిన రాము(పేరుమార్చాం) కుటుంబంతో కారులో హైదరాబాద్ వెళ్తున్నారు. సూర్యాపేటకు రాగానే తన కుమారుడు మంచినీళ్లు, తినడానికి ఏమైనా కావాలని అడగడంతో దారి వెంబడి ఓ హోటల్ వద్ద ఆగాడు. అనుకుని ఉన్న డబ్బాకొట్టులోకి నీళ్లసీసా, ఓ బ్రాండ్ బిస్కెట్ల ప్యాకెట్ కావాలని అడిగాడు. ఎమ్మార్పీ ప్రకారం వీటికి రూ.65 ఉండగా నిర్వాహకుడు రూ.75 తీసుకున్నాడు. రూ.10 అదనంగా తీసుకున్నావని అడిగితే ఇదంతే అన్నాడని వాపోయాడు.

# ఇంటిని పైకెత్తేస్తున్నారు..

నిర్మల్ : నిర్మల్ పట్టణానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా రేషన్‌డీలరు. గతేడాది కురిసిన భారీవర్షాల కారణంగా శాస్త్రినగర్‌లోని వీరింట్లో మూడు అడుగులకు పైగా నీరు చేరింది. పలు వస్తు సామగ్రి, విద్యుత్తు ఉపకరణాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టం వాటిల్లింది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా ఆ కుటుంబం ఆందోళనకు గురవుతూ వచ్చింది. అదే సమయంలో.. ఇంటిని పైకెత్తే సాంకేతికత తెలిసింది. ఆ విధానంలో ఇంటి ఎత్తు పెంచేపనిలో పడ్డారు. ఈ ఆధునికతను చూసి స్థానికులు ఆశ్చర్యపోతున్నారు.

ఇంటిని పైకెత్తడమంటే అంత సులభమేం కాదు. ఏమాత్రం అటూఇటూ అయినా.. నిర్మాణమంతా దెబ్బతింటుంది. ఈ విషయంలో భవన సామర్థ్యం కీలకం. అన్నివిధాలా బాగుందనుకుంటే.. ఇంటి చుట్టూ




హైడ్రాలిక్ జాకీలు, ఫ్రేమ్‌లను అమర్చి క్రమపద్ధతిలో వాటిని బీమ్స్, పిల్లర్లు, గోడల కింద ఏర్పాటుచేస్తారు. ఇలా అవసరాన్ని బట్టి 200-300 వరకు జాకీలు బిగించి ఏకకాలంలో ఎత్తు పెంచేలా చూస్తారు. సగటున 10- 15 జాకీలకు ఒకరు చొప్పున సిబ్బంది పర్యవేక్షిస్తారు. ఎవరికి వారు నిర్దేశిత పరిమాణంలో వాటిని పైకెత్తుతారు. గోడలు, కిటికీలు, మెట్లు ఏమాత్రం దెబ్బతినకుండా జాగ్రత్తలు చేపడ్తారు. ఒక రోజులో ఒక మీటరు ఎత్తు వరకు మాత్రమే పెంచుతున్నారంటే.. ఏస్థాయిలో వారు ఏర్పాట్లుచేస్తారు, ఎలా సమన్వయంతో పనిచేస్తారో అర్థం చేసుకోవచ్చు. గోడల ఎత్తు పెంచడానికి, పిల్లర్ల నిర్మాణానికి అవసరమైన స్టీల్, సిమెంట్, ఇటుకల ఖర్చు అంతా యజమానిదే. ఇంటి ఎత్తు పెండచమే వీరి పని. తర్వాత ఎత్తుకు తగిన రీతిలో మొరం కొత్తగా ఫ్లోరింగ్ వేయించుకోవడం, పైప్‌లైన్, విద్యుత్తు, ఇతర మరమ్మతులు చేయించుకోవడం మన బాధ్యతే. ఒప్పందపత్రం రాసిచ్చి..హరియాణాకు చెందిన ఈశ్వర్ హౌజ్ లిఫ్టింగ్ అనే కంపెనీవారు పింకీకుమార్ కౌశల్ నేతృత్వంలో ఈ పనులను నిర్వహిస్తున్నారు. ఇంటి పరిమాణం, అంతస్థులను బట్టి ఛార్జీ వసూలు చేస్తుంటారు.

# తాగు నీటి బోర్లకు మరమ్మతులు



బీర్కూర్: మండల కేంద్రంలోని 12వ వార్డులో వారం రోజుల కిందట తాగునీటి బోరు మరమ్మతునకు గురైంది. దీంతో 12, 13 వార్డుల్లోని ప్రజలు తాగునీటి సమస్య తలెత్తింది. ఈ విషయాన్ని కాలనీవాసులు సర్పంచి అరిగే ధర్మతేజ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన కాలనీలో బోరు మోటర్‌కు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గంగారాం వార్డు సభ్యుడు నవీన్, దుంపల రాజు, రామచందర్ ఇతరులు ఉన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

హైదరాబాద్ : భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



**నగరంలో పరిస్థితి ఇదీ...**

నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు – 300(సుమారు)..

ప్రధాన రకాలు–సింగిల్ యూజ్ ప్లాస్టిక్

మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.

మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.

ప్రత్యామ్నాయాలు ఇవీ..

హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)

జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.

కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.

హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.

బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

# 'దారి' దోపిడీ

హైదరాబాద్ : నగరంలోని రహదారులను చూస్తే.. గుంతలు, మిట్టలే దర్శనమిస్తాయి. ఇంజినీర్ల అవినీతి, గుత్తేదారుల నిర్లక్ష్యంతో.. రోడ్ల నిర్మాణం అత్యంత దారుణంగా జరుగుతోంది. ద్విచక్ర వాహనంలో కిలోమీటరు దూరం కూడా సవ్యంగా వెళ్లలేని పరిస్థితులున్నాయి. జీహెచ్‌ఎంసీ, జలమండలి మధ్యనున్న సమన్వయ లోపం కూడా శాపమే.

ఎన్నెన్ని లోపాలో..

రహదారిపై ఏర్పడే 2.5మీటర్ల పొడవు, 1.33మీటర్ల వెడల్పు, 0.3మీటర్ల లోతున్న గుంతను పూడ్చేందుకు జీహెచ్‌ఎంసీ రూ.12,500 ఖర్చు చేస్తోంది. వర్షాకాలంలో అలాంటి 30వేల గుంతలను పూడ్చినట్లు జీహెచ్‌ఎంసీ చెబుతోంది. అంటే.. వానాకాలంలో గుంతలను పూడ్చినందుకే రూ.37.50 కోట్లకుపైగా ఖర్చయినట్లు.

చిన్న కాంట్రాక్టర్లకు రోడ్డు పనులిస్తున్నారు. వారి దగ్గర నైపుణ్యమున్న సిబ్బంది లేకపోవడంతో..ఇష్టానుసారం రోడ్లను నిర్మిస్తున్నారు. పాత రోడ్లను మిల్లింగ్ చేయట్లేదు. రోడ్లపై ఉన్న గుంతలను వదిలేస్తున్నారు. వాలుగా నిర్మాణం జరగట్లేదు.ఇంజినీర్లు పర్యవేక్షించడం లేదు. దీంతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి.



జీహెచ్‌ఎంసీకి రెండు తారు మిశ్రమం తయారీ కేంద్రాలున్నాయి. అక్కడి నుంచి నలుమూలలకు తారు మిశ్రమాన్ని తరలిస్తుండటంతో.. వేడి చల్లబడి నాణ్యత ఉండట్లేదు.

గతేడాదిలో రూ.600 కోట్ల విలువైన పనులు సీసీ రోడ్లకు చెందినవే. ఒకసారి రోడ్డు వేస్తే.. 40ఏళ్లు నిలవాలి. నగరంలో ఐదు, పదేళ్లకోసారి సీసీ రోడ్లను తిరిగి నిర్మిస్తున్నారంటే.. నాణ్యత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చు.ఏటా రోడ్ల నిర్వహణకు జీహెచ్‌ఎంసీ చేస్తోన్న వ్యయం: రూ.1,000 కోట్లు

**నగరంలో తిరిగే వాహనాల సంఖ్య: 60 లక్షలు**

గుంతలతో దెబ్బతినే వాహనాల మరమ్మతుల ఖర్చు: రూ.50 కోట్లు

ట్రాఫిక్ సమస్యతో జరిగే ఇంధన వృథ: రూ.100 కోట్లు

గుంతలతో అనారోగ్యం.. చికిత్స కోసం ప్రజలు చేసే ఖర్చు: రూ.50 కోట్లుపనులు పకడ్బందీగా జరిగితేనే..

ప్రొఫెసర్ కె.ఎం.లక్ష్మణ్‌రావు, సివిల్ ఇంజినీరింగ్ నిపుణులు, జేఎన్‌టీయూ నగర రహదారులపై రాకపోకలు ఎక్కువ. వాటిని తట్టుకుని నిలవాలంటే నాణ్యతకు పెద్దపీట వేయాలి. నాసిరకం సామగ్రితో కట్టే మ్యాన్‌హోళ్లు కారు బరువును కూడా తట్టుకోలేవు. నీరు నిలవకుండా.. రోడ్ల నిర్మాణం జరగాలి. అప్పుడే నగరంలో రహదారులు మెరుగుపడతాయి.

# నర్సా'పుర' రాజకీయం.. రసవత్తరం




నర్సాపూర్: పురపాలిక ఎన్నికలు సమీపిస్తుండగా నర్సాపూర్‌లో రాజకీయం వేడెక్కుతోంది. మున్సిపాలిటీగా ఆవిర్భవించాక జరుగుతున్న రెండో ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించగా, తుది జాబితా ఈ నెల 10న విడుదల కానుంది. ఈ క్రమంలో ఆశావహులు టిక్కెట్లను పొందేందుకు పావులు కదుపుతున్నారు. మొదటి సారిగా జరిగిన ఎన్నికల్లో భారాస జెండాను ఎగురవేసింది. ఈ సారి రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎలాగైనా హస్తగతం చేసుకోవాలని ఉవిళ్లూరుతోంది. భాజపా సైతం పట్టు సాధించడానికి ప్రయత్నాలు సాగిస్తోంది.

**కలిసి సాగేనా..**

మొన్నటివరకు అధికార కాంగ్రెస్‌లో నాయకులు ఎవరికి వారే యమునా తీరే అన్న చందంలా సాగారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజిరెడ్డి ముందస్తుగా నమస్తే నర్సాపూర్ పేరిట కార్యక్రమం చేపట్టగా, సొంతపార్టీ నేతలు అభ్యంతరం చెప్పడంతో నిలిచిపోయింది. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథలయ సంస్థ అధ్యక్షరాలు సుహాసినిరెడ్డి కలిసి కార్యక్రమాలు చేపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆరోగ్యం సహకరించడం లేదు. శుక్రవారం వీరంతా కలిసి సమావేశం నిర్వహించడం కొంత ఊరటనిచ్చేదే.

**ఎమ్మెల్యేకు ప్రతిష్ఠాత్మకం..**

ఎమ్మెల్యే సునీతారెడ్డి నియోజకవర్గంలోని ఏకైక పురపాలిక కావడంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తొలి ఎన్నికల్లో భారాస పీఠాన్ని దక్కించుకుంది. తొలిసారి ఛైర్మన్‌గా ఎన్నికైన మురళీయాదవ్ పార్టీని వీడి భాజపాలో చేరారు. ఆయన్ని గద్దె దించడానికి పావులు కదపగా ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత వైస్‌ఛైర్మన్ నయిమోద్దీన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత అవిశ్వాసం పెట్టగా భారాసకు చెందిన 1వ వార్డు కౌన్సిలర్ అశోక్‌గౌడ్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**భాజపా పట్టుకోసం..**

గత ఎన్నికల్లో 4 వార్డుల్లో భాజపా కౌన్సిలర్లు గెలుపొందారు. వీరిలో ఒకరు భారాసలో చేరగా, భారాస నుంచి మరో ముగ్గురు పార్టీలో వచ్చి చేరారు. ఈ సారి మున్సిపల్ మాజీ ఛైర్మన్, భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మురళీయాదవ్ కాషాయ జెండాను ఎగురవేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వార్డుల వారీగా పర్యటిస్తున్నారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సైతం ప్రత్యేకంగా దృష్టి సారించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ పట్టు నిలుపుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

పురపాలిక: నర్సాపూర్

ఓటర్లు: 17.066

వార్డులు: 15

పురుషులు: 8328

మహిళలు: 8737

ఇతరులు: 01

# చెక్కులు రాసుకున్నారు.. బిల్లులు వెనకేసుకున్నారు..!




వైరా : వైరా పురపాలికలో జరిగిన చెక్కుల దందాలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇష్టారాజ్యంగా మున్సిపాలిటీ సొత్తును కాజేసిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు తాజాగా ఆదేశాలు జారీ చేశారు. గతేడాది ఆగస్టు మూడోవారం వరకు వైరా పుర కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన చింతా వేణు, ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్‌గా పనిచేసిన ఎ.వెంకటేశ్వరరావు (ఇప్పటికే సస్పెండయ్యారు)పై తక్షణమే క్రిమినల్ కేసు పెట్టాలంటూ పురపాలిక వరంగల్ ప్రాంతీయాధికారి(ఆర్‌డీఎంఏ) సాహిద్ మసూద్ ప్రస్తుత పుర కమిషనర్ గురులింగానికి లిఖితపూర్వక ఆదేశాలు వెలువరించారు. చింతా వేణు ప్రస్తుతం నల్గొండ జిల్లా నందికొండ పుర కమిషనర్‌గా పనిచేస్తున్నారు.

**సొంత ఖాతాకు రూ.52 లక్షలు బదిలీ**

'వీడాలి చెక్కుముడి' శీర్షికన గతేడాది అక్టోబర్ 8న కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు అక్టోబర్ రెండో వారంలో విచారణ నిర్వహించి అవినీతి జరిగిందని నిర్ధారించారు. ఇన్‌ఛార్జి అకౌంటెంట్(ఒరిజినల్ పోస్టింగ్ జూనియర్ అసిస్టెంట్)గా పనిచేస్తున్న ఎ.వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట 28 చెక్కులు రాసుకొని రూ.52,29,657 సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నట్లు గుర్తించి అదే నెల 17న సస్పెన్షన్ వేటు వేశారు.

**నాటి కమిషనర్ ఎందుకు అడ్డుకోలేదు..?**

ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వ్యక్తి ఏకంగా తన పేరిట 28 చెక్కులు రాసుకొని రూ.52లక్షలకు పైగా సొంత ఖాతాకు బదిలీ చేసుకున్నా నాటి కమిషనర్ చింతా వేణు ఎందుకు అడ్డుకోలేదనే అంశాన్ని ఉన్నతాధికారులు పసిగట్టారు. కార్యాలయం నుంచి ఏదేని చెక్కు మంజూరు చేస్తే దానిని ఎవరి పేరిట ఎందుకు ఇస్తున్నారు..? చెక్కు విలువ, వివరాలు, సంబంధిత బిల్లులు, ఓచర్లు తదితరాలు ఉంటేనే కమిషనర్ ఆయా సమాచారాలను క్యాష్‌బుక్‌లో నమోదుచేయించి చెక్కుపై సంతకం పెట్టాలి. బిల్లులు, ఆధారాలు లేకున్నా, ఇన్‌ఛార్జి జూనియర్ అకౌంటెంట్ నిబంధనలకు విరుద్ధంగా తన పేరిట చెక్కులు రాసుకున్నా కమిషనర్ అభ్యంతరం పెట్టకపోవటాన్ని అధికారులు విస్పష్టంగా తప్పుబట్టారు. ఆర్థిక ఉల్లంఘనలకు కమిషనర్ వేణు సైతం బాధ్యుడని తేల్చారు. కమిషనర్, ఇప్పటికే సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగి ఎ.వెంకటేశ్వరరావుపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. చింతా వేణుపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు సమాచారం. క్రిమినల్ కేసు అనంతరం సొత్తును రికవరీ చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# నిదరోతున్న.. 'నియంత్రణ' మండలి

జిన్నారం: ప్రజా సమస్యల పరిష్కారానికి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా వాయు, జల కాలుష్యంపై ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబరు 10741, హెల్ప్‌లైన్ నంబరు 91773 03214 అందుబాటులో ఉంచారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ నంబర్ల ద్వారా తమ ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు కానరావడంలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో టోల్‌ఫ్రీ నంబరు చాలా వరకు పని చేయడంలేదని వాపోతున్నారు.

**కింది స్థాయి సిబ్బందితోనే..**

పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో రాత్రి వేళల్లో వాయు కాలుష్యం అధికంగా ఉంటోంది. దీంతో స్థానికులు టోల్‌ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేస్తారు. వెంటనే అక్కడి వారు క్షేత్రస్థాయిలో ఉంటే టాస్క్‌ఫోర్స్, పెట్రోలింగ్ టీమ్‌కు సమాచారం ఇవ్వాలి. రాత్రి వేళల్లో సంచరించే సిబ్బంది కాలుష్య కారక పరిశ్రమను గుర్తించినా, లోపలికి వెళ్లి నిర్ధారించే అవకాశం లేదు. కేవలం బయట ఉండే వీవోసీ యంత్రంపై రీడింగ్ రాసుకుని వెళ్లాలి. దానిని పీసీబీ ప్రాంతీయ, రాష్ట్ర కార్యాలయంలో సమర్పించినా ఎటువంటి చర్యలు కానరావడంలేదు. గతంలో అధికారి స్థాయి వారు రాత్రి వేళల్లో పర్యటించే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఫిర్యాదు చేసిన వారికి తాము క్షేత్ర స్థాయికి వచ్చామనే సమాచారం కూడా ఇవ్వడంలేదు. తీవ్రమైన సమస్య ఉంటే ఫిర్యాదును కొందరు అధికారులు ముందే సంబంధిత పరిశ్రమలకు చేరవేస్తారనే ఆరోపణలు సైతం ఉన్నాయి.

**నెలలో వెయ్యికి పైగా**

కాలుష్య సమస్యలపై నెలలో వెయ్యికి పైగా ఫిర్యాదులు అందుతాయి. ఇందులో టోల్‌ఫ్రీ నంబరుతోపాటు అధికారులకు ఫోన్ ద్వారా వివరిస్తారు. ఇదే సమయంలో పారిశ్రామిక వాడలకు సమీపంలోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల నుంచి మెయిల్ ద్వారా వస్తాయి. ఇదే సమయంలో లిఖిత పూర్వకంగా కూడా అందుతాయి. కలెక్టరేట్‌లో జరిగే ప్రజావాణిలో వచ్చే వాటిని పీసీబీకి పంపుతారు. ఇన్ని రకాలుగా వచ్చినా చర్యలు మాత్రం తీసుకోరు. పారిశ్రామిక వాడల వారీగా అధికారులను నియమిస్తే ప్రయోజనం ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# ఖాతాల్లో నిధులు.. కదలని పనులు

హైదరాబాద్ : కోట్ల రూపాయల నిధులు ఖాతాల్లో మూలుగుతున్నా అభివృద్ధి పనులు ముందుకు సాగడంలేదు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో కీలకమైన అభివృద్ధి పనులకు సంబంధించి రూ.303 కోట్లు ఎస్క్రో ఖాతాలో సుమారు రెండు నెలలుగా ఉన్నా వినియోగంలో జాప్యం కొనసాగుతోంది. పర్యవసానంగా కంటోన్మెంట్ పరిధిలో భూగర్భ మురుగునీటి వ్యవస్థ ఆధునికీకరణ, హస్మత్‌పేట నాలా, పికెట్‌నాలాల అభివృద్ధి జాడలేదు.

**శాఖల మధ్య లోపించిన సమన్వయం**


ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రక్షణ శాఖకు చెందిన 24 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంది. దీనికి పరిహారంగా రక్షణ శాఖకు ఇచ్చిన రూ.303.62 కోట్లను కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి పనులకు కేటాయించారు. వాటిని అక్టోబరులో



బోర్డు, జీహెచ్‌ఎంసీ ఎస్క్రో ఖాతాలో జమచేశారు. మూడు నెలలు కావస్తున్నా పనులకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదు. సుదీర్ఘకాలంగా ఈ పనుల కోసం కంటోన్మెంట్ ప్రజలు ఎదురుచూస్తున్నా అంతకంతకూ జాప్యం జరుగుతోంది. దశాబ్దాల నాటి పాత డ్రైనేజీ వ్యవస్థ స్థానంలో ఆధునిక భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుతో పాటు వరద ముప్పును తప్పించేలా హస్మత్‌పేట్, పికెట్ ప్రధాన నాలాలను విస్తరించి రక్షణ గోడలను నిర్మించడం వంటి కీలకమైన పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి చేపట్టాల్సి ఉంది. శాఖల మధ్య సమన్వయ లోపంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. టెండర్ల ప్రకియ చేపట్టి పనులు ప్రారంభించే నాటికి వర్షాకాలం వస్తుందని వెంటనే పనులు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు జీహెచ్‌ఎంసీకి వివరిస్తున్నా ఫలితం లేదు.

# యువత.. ఆర్థిక అక్షరాస్యత

హైదరాబాద్: దైనందిన జీవితంలో భాగమైన వస్తువులు, సేవలు, అనూహ్యంగా దూసుకువెళ్తున్న బంగారం, వెండి ధరలను తెలుసుకోవడంతో పాటు అవి ఎందుకు పెరుగుతున్నాయి? మార్కెట్‌లో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయ్? అన్న అంశాలపై ఓయూ వాణిజ్య విభాగం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. స్టాక్‌మార్కెట్‌లో అంశాలను వారికి పరిచయం చేస్తున్నారు. ఇందుకోసం సెబీ గుర్తింపున్న సంస్థల నుంచి ప్రతినిధులను ఎంపిక చేసి వారికి ఆర్థిక అక్షరాస్యతను నేర్పిస్తున్నారు.పొదుపు.. వ్యూహాత్మక పెట్టుబడులపై.. బ్యాంకుల్లో నగదు డిపాజిట్ చేయడం, బీమా పాలసీలు తీసుకోవడం వంటివి సాధారణ పొదుపు విభాగంలోకి వస్తుండగా... స్టాక్ మార్కెట్‌లో




పెట్టుబడులు వ్యూహాత్మకమైనవని స్టాక్ మార్కెట్ నిపుణులు ఓయూ విద్యార్థులకు వివరిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం స్టాక్ మార్కెట్ నిపుణులు డాక్టర్ సారికా లోహానా హైదరాబాద్‌కు వచ్చి పెట్టుబడుల తీరును వివరించారు. ఎలాంటి షేర్లు పెరుగుతున్నాయి? ఎందుకు అవే షేర్లు లాభాల్లో ఉంటున్నాయి? పెరుగుదల, తగ్గుదలతో ఏయే కారణాలు ప్రభావం చూపిస్తున్నాయన్న అంశాలను ఆమె విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. వస్తువులు (కమోడిటీస్), బంగారం, వెండి (బులియన్) మార్కెట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనుకోకుండా అవసరాలు వస్తే ఇబ్బందులు పడకుండా షేర్లు, పొదుపు సొమ్ముతో వాటిని తీర్చుకునేలా ప్రణాళికలు ఉండాలని సోదాహరణంగా తెలియజెప్పారు.

# పండగ వేళ.. వంటనూనెల మంట

పెద్దపల్లి: ఏడాదిగా పెద్దగా పెరగని వంట నూనె ధరలు రెండు వారాల్లోనే ఒక్కసారిగా పెరిగాయి. సంక్రాంతి సీజన్ కావడం.. పిండి వంటలు పెద్దఎత్తున చేసుకోవడం ఆనవాయితీ కావడం కారణమా.. మరైదేనా పరిస్థితులా తెలియదు కానీ.. గడిచిన పదిహేను రోజుల్లో లీటర్ పొద్దు తిరుగుడు నూనె ధర రూ.5 వరకు పెరిగింది. దసరా (అక్టోబరు నెల) పండగ రేట్లతో పోలిస్తే లీటర్‌కు రూ.10 చొప్పున పెరిగింది. మూడు నెలల్లోనే ఇంత మొత్తంలో పెరగడంపై అనుమానాలున్నాయి. ఒకేసారి ఇలా ధరలు పెరగడానికి వ్యాపారులు సరకు బ్లాక్ చేసి ధరలు పెంచడమూ కారణమన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.

**ఉమ్మడి జిల్లా ప్రజలపై రూ.కోటి భారం**

ఉమ్మడి జిల్లాలో ప్రజలు, ఇతర వాణిజ్య అవసరాల(హోటళ్లు, రెస్టారెంట్లు) కోసం ప్రతినెలా 3400 మెట్రిక్ టన్నుల వంటనూనెలు వినియోగిస్తారు. వీటిలో సింహభాగం పొద్దు తిరుగుడు నూనె 2040 మెట్రిక్ టన్నులు, పామాయిల్ 840 మెట్రిక్ టన్నులు, ఇతర నూనెలు 520 మెట్రిక్ టన్నులు ప్రజలు వాడుతున్నారు. ఈ నెల మొదటి వారం ముగిసేసరికి గృహావసరాల కోసం ఒక నెలకు సరిపడా నూనెలను ప్రజలు కొనుగోలు చేశారు. ఈ విధంగా జిల్లా ప్రజలపై అదనంగా రూ.కోటి భారం పడింది. జిల్లాలో ప్రతినెలా రూ.30.60 కోట్ల విలువైన పొద్దుతిరుగుడు నూనె వినియోగమవుతుండగా.. ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం రూ.31.62 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. **లీటరు రూ.10 వరకు..** దేశీయ అవసరాలకు పొద్దుతిరుగుడు నూనెను విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటుండగా.. అంతర్జాతీయ మార్కెట్ ఎగుడు దిగుడులకు అనుగుణంగా కొన్ని రోజులుగా ఈ నూనెల ధరల్లో మార్పులు లేవనే చెప్పాలి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆరంభంతో పోలిస్తే లీటరు ధర రూ.10 వరకు పెరిగింది. అయితే దేశీయ నూనెలైన వేరుశనగ, రైస్‌బ్రాన్(తవుడు), సోయాబీన్ నూనెల ధరల్లో పెద్దగా మార్పులేమి లేవు. సాధారణంగా పొద్దు తిరుగుడు, ఇతర నూనెల కంటే వేరుశనగ నూనె ఎక్కువ ధర పలుకుతుంది. కానీ ఈ ఏడాది వేరుశనగ.. సీజన్ ఆరంభం నుంచి ఇతరవాటికంటే తక్కువ ధర ఉంటుంది.




# రైతులకు శుభవార్త.. రైతు భరోసాపై కీలక అప్‌డేట్..

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకానికి సంబంధించి కీలక మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. అర్హులైన ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందేలా ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తోంది. సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే కొత్త పట్టాదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు. వానాకాలం సీజన్ ముగిసిన తర్వాత కొత్తగా పట్టాలు పొందిన సుమారు 80 వేల మంది రైతులు తమ సమీపంలోని వ్యవసాయ విస్తరణాధికారులను కలిసి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. గతంలో సాగు చేయని భూములకు, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా పొరపాటున నిధులు వెళ్లినట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈసారి అలాంటి పొరపాట్లకు తావు లేకుండా కేవలం సాగులో ఉన్న భూములకు మాత్రమే నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. నిజమైన సాగుదారులను గుర్తించడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం తగ్గుతుందని.. ఆ నిధులను అర్హులైన పేద రైతులకు మళ్లించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. సాగు భూములను పక్కాగా గుర్తించేందుకు అగ్రికల్చర్ యూనివర్సిటీ సహకారంతో సాటిలైట్ సర్వేను కూడా నిర్వహిస్తున్నారు. అయితే కేవలం సాటిలైట్ డేటాపైనే ఆధారపడకుండా.. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారుల ధృవీకరణను కూడా పరిగణనలోకి తీసుకోనున్నారు. రైతు భరోసా నిధుల విడుదలలో జరుగుతున్న ఆలస్యం వెనుక ఆర్థిక, పరిపాలన పరమైన కారణాలు ఉన్నాయి. ఈ విడతలో సుమారు 65 లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయం అందించాల్సి ఉండగా, ఇందుకోసం సుమారు 10 వేల కోట్ల రూపాయల నిధులు అవసరమని అంచనా. ఈ భారీ మొత్తాన్ని సేకరించడం ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. పాత రైతులతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి కూడా కలిపి ఒకేసారి నగదు జమ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. దీనివల్ల లబ్ధిదారుల సంఖ్య పెరగనుంది. రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ , పరిషత్ ఎన్నికల దృష్ట్యా.. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఈ నిధులను విడుదల చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. కౌలు రైతులకు కూడా ఈ పథకం వర్తింపజేయాలనే ప్రతిపాదనపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

సాగుదారుల వివరాలను నమోదు చేసే క్రమంలో పారదర్శకత పాటించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కసరత్తు అంతా పథకంలోని లొసుగులను తొలగించి.. కేవలం పంట పండించే రైతులకు మాత్రమే లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా సాగుతోంది. అనర్హులను తొలగించడం ద్వారా వ్యవస్థను ప్రక్షాళన చేయవచ్చని అధికారులు భావిస్తున్నారు.




# సర్వ శుభాలనిచ్చే సంక్రాంతి.. ఆరోగ్యాన్నిచ్చే పిండివంటలు

భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ రోజుల్లో ఆచరించే పూజలు, నోములు, బొమ్మల కొలువు ఎంతో ఆనందంతో పాటు సర్వ శుభాలను కలగజేస్తాయని నమ్మకం కలుగుతుంది. పంచభూతాలలో పరమాత్మను దర్శించగలిగి, జ్ఞానమనే చీకటి నుంచి వెలుగు మార్గాన పయనమే సంక్రాంతి సూర్యదేవుడికి ఫలపుష్పాదులను సమర్పించి పూజిస్తారు. సంవత్సరంలో పన్నెండు సంక్రాంతులు వచ్చినా సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే కాలం పుణ్యపదమని నమ్మకం.

**ముగ్గులతో ఆరోగ్యం..** ధనుర్మాసంలో వానలు తగ్గి భూమి పొడిగా ఉంటుంది. ఆవుపేడ కలిపిన నీటిని చల్లి ముగ్గులు పెడితే కంటికి ఇంపుగా ఉండడమే కాకుండా పురుగులు, విష కీటకాలు ఇంట్లోకి రావు. సున్నంతో పెట్టిన ముగ్గులు, గడపలు, గొబ్బెమ్మలకు పెట్టిన పసుపు కుంకుమలు ఇంటికి శోభనివ్వడమే కాకుండా పసుపు సూక్ష్మజీవులను నశింపజేస్తుంది. హరిదాసులు, నందీశ్వరుడినే నాట్యమాడించే గంగిరెద్దుల వారు ఇచ్చినది తీసుకుని సంతృప్తిగా వెళ్లడం దానగుణాన్ని పెంపొందిస్తుంది.

**పిండి వంటలు ప్రత్యేకం..** సంక్రాంతి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బంధువులు, సన్నిహితుల కోసం సంప్రదాయ వంటలు తయారు చేస్తారు. అరిసెలు, పాకుండలు, చనివిడి, సున్నుండలు, బెల్లం గవ్వలు, పూతరేకులు, నువ్వుల ఉండలు, కజ్జికాయలు, లడ్డూలు కరకజ్జం, గోరుమిటీలు, బెల్లం కొమ్ములు, కొబ్బరి నౌజు, చెగోడీలు, జంతికలు, చెక్క వడలు, మురుకులు, కారం బూంది, కారప్పూస, కారం గవ్వలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే తెలుగు లోగిళ్లలో మహిళలు పిండి వంటలు సిద్ధం చేశారు. ప్రస్తుతం కొంతమంది ఆర్డర్లపై పిండి వంటలు కొనుగోలు చేసుకుంటున్నారు. అరిసెలు కిలో రూ.800 నుంచి రూ.1000 గోరుమిటీలు, కజ్జికాయలు రూ.500 నుంచి రూ.600, జంతికలు, ఆకు వడలు, కరకజ్జం, వేరుశనగ అచ్చు, నువ్వు అచ్చులు కిలో రూ.500 నుంచి రూ.600 చొప్పున అమ్మకాలు చేస్తున్నారు. సాధారణంగా సంక్రాంతి నైవేద్యాలలో కట్టుపొంగలి, చక్కెర పొంగలి ఉంటాయి. పొంగలిలో ఉపయోగించే పెసరపప్పు, మిరియాలు, జీలకర్ర, అల్లం శ్లేష్మాన్ని పోగొట్టి ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. నెయ్యి శరీరానికి పుష్టిని, ఎముకలకు బలాన్ని ఇస్తుంది. తెల్లవారుజామునే లేవడం, స్నానం, భగవంతుని ప్రార్థించడం, పూజ, నైవేద్యాలు, ఆరోగ్య కారకం. పార్వతి దేవి శివుని భక్తగా పొందడానికి తపన్సు చేసి పూజించి.. పెసరపప్పు, బియ్యం, నెయ్యి కలిపి వండిన పొంగలిని వివేచన చేసినట్లు పురాణ కథనం.

**తొలి పండుగ భోగి..** సంక్రాంతి తొలి పండుగ భోగి. తెల్లవారుజామునే చెట్టు దుంగలు, ఇళ్ల వద్దనున్న పాత సామానుతో మంటవేస్తారు. భోగి, పిడకలను వేస్తారు. బోగి మంటలలోనే నీళ్లను కాచుకుని అభ్యంగన స్నానాలు ఆచరిస్తారు. నూతన వస్త్రాలు ధరించి ఆలయాలను దర్శించుకుంటారు. భోగమంటలు మానవుల్లోని కల్మషాలను తొలగిస్తాయని, సంకటాలను దగ్ధం చేస్తాయని ప్రతీతి. చెడును విడిచిపెట్టి మంచిని పెంపొందించుకోవటమే భోగి మంటల సందేశం. సూర్యగమనాన్ని భోగమంటారు. మనలోని అజ్ఞానాన్ని నశింపజేసి సన్మార్గంలో నడిపించమని అగ్నిదేవుని ప్రార్థించడమే భోగ మంటలోని పరమార్థం. ఈ పొగవల్ల క్రిమి కీటకాలు నశించి.. ఆరోగ్యం చేకూరుతుందని నమ్ముతారు. భోగినాడు సాయంత్రం చిన్నారులకు భోగి పండ్లు పోయడం అనవాయితీ.



# బిజెపిలోకి హరీష్ రావు, కాంగ్రెస్ లోకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్?

హైదరాబాద్ : సంక్రాంతి పండుగ వచ్చిన నేపథ్యంలో గులాబీ పార్టీకి ఊహించని షాక్ తగినట్టు చెబుతున్నారు. గులాబీ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు భారతీయ జనతా పార్టీలోకి వెళ్లబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈనెల చివర్లో గులాబీ పార్టీని వీడి భారతీయ జనతా పార్టీలోకి హరీష్ రావు వెళ్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. హరీష్ రావు తో పాటు బడా లీడర్లు కూడా భారతీయ జనతా పార్టీలోకి వెళు తున్నట్లు చెబుతున్నారు. హరీష్ రావు తో పాటు మరో కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పేయోజనలో ఉన్నట్లు ప్రచారం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. కెసిఆర్ అలాగే కేటీఆర్ విధానం నచ్చగా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పార్టీ మారబోతున్నట్లు పోస్టులు పెడుతున్నారు. కల్వకుంట్ల కవిత ఎపిసోడ్ నేపథ్యంలో హరీష్ రావును కించపరిచేలా వ్యవహరిస్తున్నారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గుర్రుగా ఉన్నారట. అందుకే గులాబీ పార్టీని వీడి మళ్ళీ కాంగ్రెస్ పార్టీ లోకి వెళ్లి ఎందుకు సిద్ధమవుతున్నారట. కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే టికెట్ కూడా ఖరారు అయినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల వరకు సలహాదారు పోస్ట్ కూడా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కు ఇచ్చేందుకు రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు అంట. అందుకే గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్లోకి జంప్ అవుతున్నట్లు ప్రచారం సాగుతోంది.

# భర్త కోసం భార్య చైన్ స్నాచింగ్.. చివరకు..

మేడ్చల్ జిల్లా, జనవరి14: భార్యాభర్తల బంధం ఎంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కష్టసుఖాల్లో ఒకరికొకరు తోడునీడగా ఉంటారు. చాలా మంది మహిళలు, తమ భర్తల కోసం అనేక త్యాగాలు చేస్తుంటారు. అలాగే.. ఇటీవల ఓ మహిళ తన భర్త కోసం చేసిన పని.. ఆమెను ఇబ్బందులకు గురిచేసింది. తన భర్త చేసిన అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది. అయితే.. చోరీ చేసిన అరగంటకే అడ్డంగా పోలీసులకు దొరికింది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. మేడ్చల్ జిల్లాకు చెందిన రాజేశ్ అనే వ్యక్తిని, వరంగల్ ప్రాంతానికి చెందిన అనితా రెడ్డి అనే మహిళ రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. అనిత.. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసింది. అయితే.. ఆ జాబ్ మానేసి ప్రస్తుతం ఇంట్లో ఉంటోంది. తొలుత ఓ ఫైనాన్స్ సంస్థలో పనిచేసిన రాజేశ్.. ఆ తరువాత మానేశాడు. అతడు నాలుగైదు లక్షల రూపాయల వరకు అప్పు చేశాడు. తాను చేసిన అప్పువల్ల తరచూ బాధపడుతున్నాడు. అతడు అలా ఉండటం చూసి.. తన భర్త అప్పులు ఎలాగైనా తీర్చాలని అనితా రెడ్డి నిర్ణయించుకుంది. దీంతో చైన్ స్నాచింగ్ చేద్దామని మియాపూర్




ప్రాంతానికి చెందిన నల్ల కమల అనే మహిళ మెడలో ఆభరణాలు దొంగలించేందుకు ప్రయత్నించింది. లిఫ్ట్‌లో వెళ్తున్న కమల మెడలో గోల్డ్ చైన్ లాక్కునేందుకు అనిత ప్రయత్నించింది. ఇంతలో ఆమె గట్టిగా కేకలు వేయడంతో.. చేతికి దొరికిన అర తులం నల్లపూసల గొలుసుతో అక్కడి నుంచి పరారైంది అనిత. బాధితురాలు కమల.. సనత్ నగర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. ఈ క్రమంలో సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా అరగంటలోనే నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు.




కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మైసూరులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సమావేశమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీఎం మార్పు అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. రాహుల్‌తో భేటీలో సీఎం మార్పు అంశంపై స్పష్టతనివ్వాలని సిద్ధరామయ్య ఆయనను కోరినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అధికార మార్పు విషయంలో రాష్ట్ర ప్రజలు, పార్టీ, నేతలు కార్యకర్తలు గందరగోళానికి గురవుతున్నారని.. దీనిపై వారికి స్పష్టతనివ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నట్లు సమాచారం. గత నవంబరు 20తో సిద్ధరామయ్య సర్కారుకు రెండున్నరేళ్ల గడువు ముగిసిన నేపథ్యంలో సిద్ధు, డీకే మద్దతుదారులు అదే పనిగా దిల్లీలో కాంగ్రెస్ నేతలతో సమావేశమవుతున్నారు. సిద్ధరామయ్య, డీకే అల్పాహార భేటీల పేరుతో మద్దతుదారులతో సమావేశమవడం, తాను సీఎం కావాలనే కోరికను శివకుమార్ పలుమార్లు పరోక్షంగా వ్యక్తపరుస్తుండడంతో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందనే వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ సమయంలో రాహుల్ కర్ణాటకకు వెళ్లడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే రాహుల్‌గాంధీతో తాము మర్యాదపూర్వకంగానే భేటీ అయినట్లు సిద్ధరామయ్య పేర్కొన్నారు. మంత్రివర్గ విస్తరణపై త్వరలో రాహుల్‌తో మరోసారి సమావేశమవ్వనున్నట్లు తెలిపారు.



# సుక్మా జిల్లాలో 29 మంది మావోయిస్టులు లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట బుధవారం 29 మంది కీలక మావోయిస్టులు లొంగిపోయారు. గోగుండాలో ఎఫ్ఓబీ ఏర్పాటు తర్వాత మావోయిస్టు కార్యకలాపాలు చాలా వరకు అదుపులోకి వచ్చాయని ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారంతా దర్భ, కేరళ పాల్ ఏరియా కమిటీలో చురుగ్గా వ్యవహరించిన వారేనన్నారు. తాజా పరిస్థితులు గమనించి మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి లొంగిపోతే మంచిదన్నారు.

# ఘోరం: రైలుపై జారిపడిన క్రేన్.. 22 మంది మృతి




బ్యాంకాక్: థయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కదులుతున్న రైలుపై ఓ క్రేన్ జారిపడటంతో బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో 22 మంది మృతి చెందినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రాంతంలో హైస్పీడ్ రైలు ప్రాజెక్ట్ కోసం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనుల్లో ఉన్న ఓ క్రేన్ అదుపుతప్పి కింద పడింది. అదే సమయంలో కింద ఉన్న పట్టాలపై నుంచి ఓ ప్రయాణికుల రైలు వెళ్తోంది. క్రేన్ పడటంతో ఆ రైలు బోగీలు పట్టాలు తప్పాయి. కొన్ని బోగీల్లో మంటలు చెలరేగాయి. ఈ సమాచారమందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 22 మంది మృతిచెందగా.. మరో 30 మందికి పైగా గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రమాద సమయంలో రైల్లో 150 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ములుగు జిల్లాపై.. ఆ వదంతులు నమ్మొద్దు!: మంత్రి సీతక్క

ములుగు జిల్లాను తొలగిస్తున్నారంటూ వస్తున్న వదంతులను ఎవరూ విశ్వసించవద్దని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. పలు యూట్యూబ్ ఛానెళ్ల ద్వారా జిల్లాపై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీపై బురదజల్లేందుకే ఈ విధంగా ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజన శాస్త్రీయంగా జరగలేదని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు గుర్తు చేశారు. అందుకే మరోసారి జిల్లాల పునర్విభజన గురించి సీఎం చెప్పారని వివరించారు. ములుగు జిల్లా అభివృద్ధిపై అనుమానాలు అవసరం లేదని మంత్రి తెలిపారు.







ఇరాన్‌లో ఆందోళనలు హింసాత్మకంగా మారుతున్న నేపథ్యంలో.. అక్కడి భారత రాయబార కార్యాలయం ఆ దేశంలో ఉంటున్న మన పౌరులను అప్రమత్తం చేసింది. అందుబాటులో ఉన్న రవాణా మార్గాల్లో దేశాన్ని వీడాలని సూచిందింది. మరోవైపు భారత విదేశాంగశాఖ సైతం.. తదుపరి నోటీసు ఇచ్చేవరకు ఆ దేశానికి ప్రయాణించొద్దని సూచించింది. "స్థానికంగా మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ఇరాన్ (×తీుఅ)లోని భారత పౌరులు, భారత సంతతికి చెందినవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఆందోళనలు, ప్రదర్శనలు జరుగుతున్న ప్రాంతాలకు దూరంగా ఉండాలి. రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలి. భారత పౌరులు తమ పాస్‌పోర్ట్‌లు, గుర్తింపు కార్డులు సహా ప్రయాణ, ఇమిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలి. ఎంబసీలో రిజిస్టర్ కాకపోతే వెంటనే చేసుకోవాలి" అని ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం సూచించింది. ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు ఉద్రిక్తంగా మారాయి. ఇప్పటివరకు 2500 మందికిపైగా మృతి చెందారు. మరోవైపు.. నిరసనలు కొనసాగించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపునిచ్చారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగశాఖ ఇప్పటికే ఓసారి పౌరులను అప్రమత్తం చేసింది. ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను మానుకోవాలని తెలిపింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660